క్లుప్తంగా

కొనసాగుతున్న జంగుబాయి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

ఇంద్రవెల్లి: పుష్యమాసం పురస్కరించుకుని మండలకేంద్రంతో పాటు మండలంలోని ఆదివాసీ గ్రామాల్లో గిరిజనులు జంగుబాయి పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. బుధవారం మండలంలోని వాల్గొండ గ్రామంలో జంగుబాయి దీక్ష శిబిరం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వాములు కొట్నాక్ సంతోష్, కొట్నాక్ అచెంత్‌రావ్, కినక లింబారావ్, కినక మారుతి పటేల్, కొట్నాక్ సంతోష్, కినక రాజేశ్వర్, కొట్నాక్ లచ్చు తదితరులు ఉన్నారు.

ఏటీపీ క్యాలెండర్ ఆవిష్కరణ



క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇంద్రవెల్లి: మండలకేంద్రంలోని కేస్లాపూర్ నాగోబా ఆలయం వద్ద బుధవారం ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ (ఏటీఏ)2025 నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ముందుగా నాగోబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ రాష్ట్ర నాయకులు మెస్రం జగన్, గేడం శ్రీరాంలు మాట్లాడారు. ఆదివాసీ టీచర్స్ అసోసియేషన్ సభ్యులు ఐక్యంగా ఉండి న్యాయమైన హక్కుల సాధనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గేడం శ్యాంసుందర్, సభ్యులు హరిచంద్, కేశవ్‌రావ్, మనోహర్, గులాబ్, నాందేవ్ తదితరులు ఉన్నారు.

యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

ఇంద్రవెల్లి: విద్యార్థులు, యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని ఎస్సై దుబ్బాక సునీల్ అన్నారు. బుధవారం మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు గుట్కా, గంజాయి వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని, సెల్‌ఫోన్‌లకు దూరంగా ఉండి, సైబర్ నేరాలపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

ఇసుక ట్రాక్టర్లకు జరిమానా

తాంసి: భీంపూర్ మండలంలోని తాంసి(కె), గొల్లఘాట్ శివారులోని పెన్‌గంగ నది నుంచి అక్రమంగా మహారాష్ట్రకు ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్‌లను ఆదివారం భీంపూర్ పోలీసులు పట్టుకున్నారు. మహారాష్ట్రకు చెందిన ఇసుక ట్రాక్టర్‌లను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు. తదుపరి చర్యల నిమిత్తం ఎస్సై కలీం మైనింగ్ శాఖ అధికారులకు లేఖ రాశారు. మైనింగ్ శాఖ అధికారులు ఇసుక ట్రాక్టర్‌లను పరిశీలించి వాహనాల్లో ఇసుక విలువను అంచనా వేశారు. జిల్లా మైనింగ్ ఏడీ రవీందర్ అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఒక్కో ట్రాక్టర్‌కు బుధవారం రూ.5వేల చొప్పున, మొత్తం ఐదు ట్రాక్టర్‌లకు రూ.25వేల జరిమానా విధించినట్లు ఎస్సై కలీం బుధవారం తెలిపారు.

10న ఉత్తర ద్వార దర్శనం

ఆదిలాబాద్: ఈనెల 10వ తేదీన ముక్కోటి ఏకాదశి పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర దేవాలయంలో ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని ఆలయ ప్రధాన అర్చకులు సునీల్ శర్మ తెలిపారు. ఆలయంలో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వైకుంఠ ఏకాదశి నేపథ్యంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సనాతన హిందూ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి తదితరులు ఉన్నారు.

ముగిసిన ప్రజావేదిక

సిరికొండ: మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బుధవారం ఉపాధిహామీ 2023 -24 సంవత్సరం పనుల మూడో విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ప్రజావేదికలో అడిషనల్ డీఆర్‌డీవో పీడీ కుటుంబరావు ఆధ్వర్యంలో తనిఖీ నివేదికలు పరిశీలించారు. మండల వ్యాప్తంగా 2023 -24 ఆర్థిక సంవత్సరానికి రూ.6.70 కోట్లు ఉపాధి పనులు జరిగినట్లు తెలిపారు. రికార్డుల నిర్వహణలో అధికారులు, సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. 19 గ్రామ పంచాయతీల్లో రూ. 9 లక్షలు రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. ఏపీవో రాజేశ్వర్, అసిస్టెంట్ పీడీ కృష్ణరావు, ఎంపీడీవో రవీందర్, ఏపీవో భీంరావు, ఎస్సార్పీ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

జాతరకు ఏర్పాట్లు ఎప్పుడో..?



కోతకు గురై అధ్వానంగా మారిన ముత్నూర్ నుంచి కేస్లాపూర్ రోడ్

ఇంద్రవెల్లి: ఆదివాసీల ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా జాతరకు ఏర్పాట్లు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఈనెల 28న జాతర ప్రారంభం కానున్న నేపథ్యంలో 2వ తేదీన ఆయా ప్రభుత్వ శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ రాజర్షిషా, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తాలు సమీక్ష సమావేశం నిర్వహించారు. వెంటనే జాతరకు సంబంధించిన ఏర్పాట్లు ప్రారంభించాలని ఆదేశించారు. ముత్నూర్ నుంచి కేస్లాపూర్, కేస్లాపూర్ నుంచి దస్నాపూర్ రోడ్లకు, కేస్లాపూర్‌కు అనుబంధంగా ఉన్న ఇతర రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. కానీ ఇంతవరకు అధికారులు రోడ్ల మరమ్మతులకు చర్యలు తీసుకోలేదు. కాగా తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, స్నానపు గదుల ఏర్పాట్ల విషయంలోనూ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా మెస్రం వంశీయులు బస చేసే గోవడ్ పరిసర ప్రాంతం పిచ్చి మొక్కలతో నిండిపోయి పారిశుధ్యం లోపించింది. ఇప్పటికైనా అధికారులు వెంటనే జాతర నిర్వహణలో ఎలాంటి సమస్యలు లేకుండా ఏర్పాట్లు ప్రారంభించాలని మెస్రం వంశీయులు కోరుతున్నారు.



మరమ్మతులకు నోచుకోని మరుగుదొడ్లు



గోవడ్ పరిసర ప్రాంతంలో నిరుపయోగంగా దర్శనమిస్తున్న నీటి నల్లాలు



రంగులు వేయని కోనేరు



మరమ్మతులు ప్రారంభించని మెండపల్లి రోడ్



పిచ్చి మొక్కలతో గోవడ్ పరిసర ప్రాంతం

జానపద కళలను కాపాడుకోవాలి

ఆదిలాబాద్: జానపద కళలను కాపాడుకోవాలని ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. పట్టణంలోని మంథనం ఒక సంకల్పం కళా సంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జడ కొప్పు కోలాటం ప్రదర్శనను మంగళవారం రాత్రి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ జానపద కళలు అనేవి తరిగిపోని సంపద అన్నారు. కార్యక్రమంలో మఠాధిపతి యోగానంద సరస్వతి, మాజీ మార్కెట్ చైర్మన్ సంజీవరెడ్డి, బీజేపీ నాయకులు విజయ్, శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.



ప్రదర్శనను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంకర్

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

ఆదిలాబాద్‌టౌన్: సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని సైబర్‌క్రైమ్ డీఎస్పీ హసీబుల్లా అన్నారు. సైబర్ జాగృతి దివస్ కార్యక్రమంలో భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని పలు ప్రైవేట్ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సైబర్ జాగృతి దివస్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సైబర్ అరెస్టులు, డిజిటల్ అరెస్టులపై అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్‌లకు వచ్చే లింకులను ఓపెన్ చేయవద్దని సూచించారు. ఆన్‌లైన్ గేమ్‌లు, తదితర వాటికి దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సైబర్‌క్రైమ్ సిబ్బంది సంతోష్, ఏసుదాస్ తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సైబర్‌క్రైమ్ సిబ్బంది

ఉద్యమకారులకు ఇళ్లు కట్టించాలి

బోథ్: తెలంగాణ రాష్ట్ర సాధనలో భాగంగా 2001 నుంచి 2014 వరకు తెలంగాణ ఉద్యమంలో పాల్గొని 2009లో జైలుకు వెళ్లిన తమకు ప్రభుత్వం ఇళ్లు కట్టించి ఇవ్వాలని ఉద్యమకారులు రమణగౌడ్, దేవిదాస్, లక్ష్మి నారాయణలు కోరారు. రూ.5 లక్షలు ఇచ్చి తమను ఆదుకోవాలన్నారు. ప్రతి నెల రూ.25000, వారసులకు ప్రభుత్వ ఉద్యోగం, ఉచిత బస్సు సౌకర్యం, ఉచిత విద్య, వైద్యం, మూడెకరాల భూమి ఇవ్వాలని కోరారు. ఈ మేరకు బోథ్ ఈవో అంజయ్యకు వినతిపత్రం అందించారు.



ఈవోకు వినతిపత్రం ఇస్తున్న ఉద్యమకారులు

క్రీడలతో మానసికోల్లాసం

ఆదిలాబాద్‌టౌన్(జైనథ్): క్రీడలతో మానసికోల్లాసంతో పాటు సత్సంబంధాలు పెరుగుతాయని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జోగు రామన్న అన్నారు. బుధవారం జైనథ్ మండలంలోని మాకోడ గ్రామంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో వివేకానంద యూత్ చేపట్టిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. పార్టీ నాయకులు నారాయణ, రాంరెడ్డి, ఊశన్న, గోవర్దన్, లింగారెడ్డి, పురుషోత్తం, వేణు యాదవ్, సతీశ్, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

పలువురి పరామర్శ..

జైనథ్ మండలానికి చెందిన పలువురిని బుధవారం మాజీ మంత్రి జోగు రామన్న పరామర్శించారు. మాకోడ గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త భూమన్న అనారోగ్యంతో బాధపడుతుండగా ఆయనను పరామర్శించారు. గూడ గ్రామానికి చెందిన చిన్న గంగన్న, ఆకోలి గ్రామానికి చెందిన కార్యకర్త పార్వతి కుటుంబాలను పరామర్శించారు. ఆదిలాబాద్ పట్టణంలోని జీఎస్ ఎస్టేట్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రోకండ్ల రమేశ్ సంతాప సభలో పాల్గొన్నారు.



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న జోగు రామన్న

జైనథ్ మండలం ఆకోలి గ్రామానికి చెందిన గజానన్ జిల్లా కేంద్రంలో ప్రైవేట్ కళాశాల బస్సులో విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. విషయాన్ని తెలుసుకొని రిమ్స్ మార్చురీలో మృతదేహాన్ని పరిశీలించారు.

బోథ్: మండలంలోని కనుగుట్ట గ్రామ మాజీ సర్పంచ్ ఆకుల రాజేందర్ తల్లి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందింది. విషయం తెలుసుకున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి జోగు రామన్న బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నాయకులు శ్రీధర్ రెడ్డి, స్వామి, సదానందం, యానయ్య, రూప్‌చంద్, ఇఫ్తాకర్ పాల్గొన్నారు.

రైలు నుంచి కింద పడి ఒకరి మృతి



గుర్తు తెలియని మృతదేహం

తలమడుగు: మండలంలోని ఉండం రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి రైలు నుంచి కింద పడి మృతి చెందాడు. మృతుడి వయస్సు సుమారు 25 నుంచి 30ఏళ్ల లోపు ఉంటుందని ఆర్‌పీఎఫ్ ఆదిలాబాద్ ఇన్‌చార్జి భోజన్న తెలిపారు. మృతదేహం వద్ద ఎలాంటి ఆధారాలు లభ్యం కాలేదని మృతుడు నీలిరంగు స్వెటర్, తెల్ల చొక్కా, బూడిద రంగు పాయింట్ వేసుకొని ఉన్నట్లు పేర్కొన్నారు. మృతదేహన్ని రిమ్స్ మార్చురీలో భద్రపరిచినట్లు తెలిపారు. సమాచారం తెలిసిన వారు 944044272 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఎల్‌వోసీ అందజేసిన ఎమ్మెల్యే



ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ: మండలంలోని పట్టిటితాండ గ్రామానికి చెందిన ఆడే ఆర్యన్ నాయక్ శస్త్ర చికిత్స కోసం రూ.6లక్షల విలువ గల ఎల్‌వోసీని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ బుధవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ఆదిలాబాద్: ఆదిలాబాద్ క్రీడా పాఠశాలకు చెందిన విద్యార్థులు 38వ జాతీయ జూడో క్రీడలకు ఎంపికై సత్తా చాటారు. గత నాలుగు రోజులుగా ఢిల్లీ వేదికగా జరుగుతున్న సీనియర్ నేషనల్ జూడో చాంపియన్‌షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచి టాప్ 15లో చోటు దక్కించుకున్నారు. పాఠశాలకు చెందిన కే.అలేఖ్య 57 కేజీల విభాగంలో, ఎస్.రమ్య 48 కేజీల విభాగంలో జాతీయ క్రీడలకు ఎంపికైనట్లు జూడో జాతీయ సమాఖ్య తెలిపినట్లు కోచ్ రాజు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక

బోథ్: నిర్మల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన విశ్వం అబాకస్ అండ్ వేదిక్ మాథ్స్ జోనల్ పోటీల్లో మండల కేంద్రంలోని నాగభూషణం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. ఐదవ తరగతి చదువుతున్న నిమిష్ రెడ్డి, నాలుగో తరగతి చదువుతున్న లాడి హర్షిణిలు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి నిర్మల్ ఏఎస్పీ ఉపేంద్ర రెడ్డి బహుమతులు అందజేశారు. కాగా ఫిబ్రవరి2న హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో విద్యార్థులు పాల్గొననున్నారు.

‘పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి’

- ఎంపీ గోడం నగేశ్



పనులు ప్రారంభిస్తున్న ఎంపీ, ఎమ్మెల్యే

ఆదిలాబాద్: ఆదిలాబాద్ పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. ఆదిలాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 170 కాలనీలో రూ.1.60 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు, సీసీ డ్రెయినేజీ నిర్మాణ పనులను బుధవారం ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి శంకుస్థాపన చేసి ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని ఆదిలాబాద్ మున్సిపాలిటీ ప్రగతికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందుకు అనుగుణంగా కేంద్రం సహకారం అందిస్తూ నిధులను కేటాయిస్తోందన్నారు. ఆదిలాబాద్ పట్టణాన్ని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఎంపిక చేసుకుని అమృత్ పథకం కింద తాగునీరు, అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణం కోసం రూ. 340 కోట్లు ఇచ్చారన్నారు. ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా టీచర్స్ కాలనీలో రహదారి సౌకర్యం సరిగా లేక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కాలనీలో రహదారి నిర్మాణం చేపట్టబోతున్నట్లు పేర్కొన్నారు. ఆదిలాబాద్ అభివృద్ధికి రూ.40 కోట్లతో ప్రతిపాదనలు సిద్ధం చేశామని, త్వరలోనే అన్ని కాలనీల్లో అభివృద్ధి పనులను చేపడతామన్నారు. కౌన్సిలర్లు కృష్ణ యాదవ్, లక్ష్మణ్, పవన్ నాయక్, జోగు రవి, సోమ రవి, స్వామి రెడ్డి, అడెల్లు, రమేశ్, కాలనీ వాసులు తదితరులు ఉన్నారు.

‘పల్లెల అభివృద్ధికి ప్రభుత్వం కృషి’

నేరడిగొండ: పల్లెల అభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తోందని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడే గజేందర్ అన్నారు. బుధవారం మండలంలోని గాజిలి గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం తెలంగాణలోని అన్ని పల్లెలను అభివృద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ప్రతి గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టి గ్రామాలను బలోపేతం చేయనున్నట్లు తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని గ్రామస్తులు ఆయనకు వినతిపత్రం అందజేశారు. బోథ్ వ్యవసాయ మార్కెట్ ఉపాధ్యక్షుడు వసంత్ రావు, పటేల్ లక్ష్మణ్, పూజారి వెంకటి, రాజేశ్, జ్యోతిరామ్, మారుతి, రమేశ్ యాదవ్, సద్దాం, రాజు, బ్రహ్మయ్య పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ బౌద్ధ ధమ్మ ధ్వజ దినోత్సవం

ఆదిలాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలోని కైలాస్‌నగర్‌లో గల అశోక బుద్ధ విహార్‌లో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ బౌద్ధ పంచశీల ధమ్మ ధ్వజ దినోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. వేడుకలకు భారతీయ బౌద్ధ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞా కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. తథాగత గౌతమ బుద్ధుని విగ్రహానికి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. పంచశీల ధమ్మ ధ్వజాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం పంచశీల బుద్ధ వందన ఆలపించారు. భారతీయ బౌద్ధ మహాసభ కేంద్రీయ శిక్ష కాంతారావు వాగమారే, ఆర్గనైజింగ్ సెక్రటరీ రాందాస్ భలే రావు, రమాబాయి అంబేద్కర్ మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఉపాసికా దయాశీల హుక్కే, ఎస్‌సీఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉజ్వల ధూడే, మాయావతి ససానే పాల్గొన్నారు.



ధమ్మ ధ్వజాన్ని ఆవిష్కరిస్తున్న రత్నజాడే ప్రజ్ఞాకుమార్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

నేరడిగొండ: నేరడిగొండ సబ్‌స్టేషన్‌లో కొత్త విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ కనెక్షన్ కోసం విద్యుత్ మరమ్మతులు చేపడుతుండడంతో గురువారం మధ్యాహ్నం 1గంట నుంచి 3.30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ నాగేంద్ర ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ఘనంగా బాజీరావు బాబా సప్తాహ వేడుకలు

బేల: మండలంలోని అవాల్‌పూర్ గ్రామంలో వారం రోజులుగా కొనసాగుతున్న ఆధ్యాత్మిక గురువు బాజీరావు బాబా సప్తాహ ముగింపు వేడుకలను బుధవారం స్థానికుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రధాన వీధుల గుండా బాజీరావు బాబా చిత్రపటంతో పాటు చిన్నారులను దేవతల రూపంలో అలంకరించి పల్లకితో శోభాయాత్ర చేపట్టారు. తర్వాత బాజీరావు బాబా ఆలయ ఆవరణలో ప్రధాన శిష్య బృందం భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు అందించారు. చివరగా కాల దహీ హండిని చేపట్టి, అన్నదానం నిర్వహించారు. మాజీ సర్పంచ్ పుష్పలత సుధాంరెడ్డి, నగేశ్ విఠోబా, నరేందర్, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

నిత్యాన్నదాన సత్రంలో అన్నదానం

ఆదిలాబాద్: పట్టణంలోని రిమ్స్ ఆవరణలో గల సత్యసాయి నిత్యాన్నదాన సత్రంలో ఆదిలాబాద్ రూరల్ మండలంలోని జందాపూర్కు చెందిన తొగరి లస్మన్న కుమారులు ప్రకాశ్, భాస్కర్, దయాకర్, ప్రవీణ్ అన్నదానం చేశారు. అమ్మ ప్రేమ జ్ఞాపకార్థం అన్నదానంలో చేపట్టారు.

‘పీడీపీపీ విధానంతో రైతులకు అన్యాయం’

ఆదిలాబాద్: పీడీపీపీ (ధరలోటు చెల్లింపు పథకం) విధానంతో రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఏఐకేఎఫ్ జాతీయ కార్యదర్శి మోర్తాల చందర్ రావు అన్నారు. బుధవారం ఆదిలాబాద్ మార్కెట్ యార్డును సందర్శించి, పత్తి విక్రయాలు, చెల్లింపులకు సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ పత్తి కొనుగోళ్లలో ఇప్పటివరకు కొనసాగుతున్న విధానాన్ని తొలగించి నూతనంగా ధరలోటు చెల్లింపు పథకాన్ని అమలు చేసేందుకు కేంద్రం కుట్రలు చేస్తుందని మండిపడ్డారు. పీడీపీపీకి నీతి అయోగ్ ఆదిలాబాద్ మార్కెట్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిందని పేర్కొన్నారు. కొత్త విధానం ద్వారా సీసీఐ నిర్వీర్యమవుతుందని పేర్కొన్నారు.

‘జాతర విజయవంతం చేద్దాం’

నార్నూర్: పుష్యమాసంలో జరిగే తొడసం వంశస్తుల ఖందేవ్ జాతరను విజయవంతం చేయడానికి సమష్టిగా కృషి చేద్దామని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి బానోత్ గజానంద్‌నాయక్, ఆదివాసీ గిరిజన జేఏసీ చైర్మన్ మెస్రం రూప్‌దేవ్, వక్ఫ్‌బోర్డు సభ్యులు యూనుస్ అక్బానీలు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామ పెద్దలతో జాతర ఉత్సవాలపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఈ నెల 13న ఖందేవునికి పూజా కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

‘ప్రియాంక గాంధీపై చేసిన వ్యాఖ్యలు సరికావు’

ఆదిలాబాద్‌టౌన్: ఏఐసీసీ అగ్ర నాయకురాలు, ఎంపీ ప్రియాంక గాంధీపై బీజేపీ నాయకుడు రమేశ్ బిదూడి చేసిన వ్యాఖ్యలు సరికావని యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ఉపాధ్యక్షుడు సామ రూపేష్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలను గౌరవించే స్థానంలో ఉండి కూడా ప్రియాంక గాంధీని అవమానపర్చే విధంగా మాట్లాడటం సిగ్గుచేటని తెలిపారు. ఆయనపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బోథ్: ప్రియాంక గాంధీపై బీజేపీ నేత రమేశ్ బిదూడి చేసిన వ్యాఖ్యలపై కాంగ్రెస్ నాయకులు మండిపడ్డారు. బుధవారం బోథ్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు గుడాల అనీష్ మాట్లాడుతూ.. మహిళల పట్ల గౌరవం లేకుండా మాట్లాడటం సమంజసం కాదన్నారు. ఆయన బహిరంగ క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.